క్లుప్తంగా

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా సురేష్ కుమార్ రెడ్డి



కోనేరుసెంటర్:మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఎస్.సురేష్ కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1991వ బ్యాచ్ కు చెందిన ఆయన వివిధ పోలీస్ స్టేషన్లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. 2018 లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన పోలవరం డీఎస్పీగా, విజయవాడ ట్రాఫిక్ ఏసీపీగా, గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరులో పని చేస్తున్న ఆయన మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్ రెడ్డి జిల్లా ఎస్పీ గంగాధరరావును మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎస్పీ సురేష్ కుమార్‌ను అభినందించారు.

పార్టీలకతీతంగా రైతు దీక్షలకు మద్దతు

బంటుమిల్లి: రెండో పంట దాళ్వాకు సాగునీరివ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఈ దీక్షలకు వైఎస్సార్ సీపీ, టీడీపి, జనసేన, సీపీఎం పార్టీలు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు తీర ప్రాంత భూములు చౌడు బారకుండా ఉండాలంటే రెండో పంటకు నీరివ్వడమే పరిష్కారం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో నీరిచ్చి రైతులను ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో పార్టీల నాయకులు ఎస్.మహేష్, ఎం. నాగేశ్వరరావు, యార్ల శ్యాం బాబు, ఎస్. జనార్ధన్‌రావు, జి.నాగేశ్వరరావు, ఎం. శివరాంప్రసాదులతోపాటు బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు విద్యా సంస్థల్లో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్నచెరువు పంచాయతీ శివారు నెహ్రూనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం అజాద్ జయంతిని విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి. కాశీ విశ్వేశ్వరరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో నిర్వహించిన కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీడీ జయరాజు అధ్యాపకులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

బంటుమిల్లి: పెద్దాపురం గ్రామంలో కొలువై ఉన్న సువర్చలాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అంకురారోపణ, వాసు, హోమ పూజలు నవగ్రహ హోమాలను పండితులు పరాశరం రంగనాథాచార్యులు, రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఘనంగా చేశారు.

నేడు సామూహిక హనుమాన్ పూజ

రేమాలవారిపాలెం(నాగాయలంక):స్థానిక శ్రీసువర్చలా సమేత శ్రీభక్తాంజనేయస్వామి, సీతారామచంద్రుల ఆలయంలో మంగళవారం సామూహిక హనుమాన్ పూజ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు కమిటి ప్రతినిధి రేమాల రామ్ గోపాల్ సోమవారం తెలిపారు. ఈ విశేష కార్యక్రమాన్ని ఆలయంలో 2004 సంవత్సరంలో ప్రారంభించగా గత 20 సంవత్సరాల నుంచి ప్రతి మంగళవారం చాలీసా పారాయణం, పూజ నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రస్తుతం 1108వ వారం కాగా కార్తీకమాస ప్రత్యేక కార్యక్రమంగా దీనిని జరిపుతున్నామని జైహనుమాన్ భక్త సేవా సమాజం అధ్యక్షుడు రేమాల రామ గోపాల్ తెలిపారు. కార్తిక మాసం విశిష్టత సందర్భంగా హనుమాన్ మహా పూజతో పాటు 11 పర్యాయాలు సామూహిక చాలీసా పారాయణం ఉంటుందన్నారు.

పంటల సాగుపై అవగాహన

రావివారిపాలెం(మోపిదేవి):పంటల సాగుపై చిత్రపటం ద్వారా పని అనుభాలను కేవీకే ఘంటసాల పోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని రావివారిపాలెంలో పనిఅనుభవం, పంటల సాగు సరళిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చిత్రపటం నమూనా తయారు చేశారు. అనంతరం పలువురు రైతులు తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. వ్యవసాయశాఖ అధికారులతో పాటు గ్రామ ప్రముఖులు కంఠంనేని కుటుంబరావు, బండి శ్రీనివాసరావు, రావి కోటేశ్వరావు, పిచ్చేశ్వరావు, బాపట్ల వ్యవసాయ విద్యార్థినులు గీత సత్యశ్రీ, కె. దివ్యశ్రీ, హర్షిత, వి. గౌతమి, డి.మౌనిక పాల్గొన్నారు.

సాగరతీరంలో

పౌర్ణమి స్నానాలపై నీలినీడలు

- హంసలదీవి బీచ్ వద్ద కనీస ఏర్పాట్లు చేయని అధికారులు
- పౌర్ణమి స్నానాల ఏర్పాట్లపై సమీక్ష కూడా నిర్వహించని వైనం
- భక్తుల మనోభావాలు కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం



పాలకాయతిప్ప బీచ్ వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

కోడూరు: కృష్ణమ్మ సాగరుడిలో కలిసే పవిత్ర పుణ్యక్షేత్రమైన హంసలదీవి సాగరతీరంలో కార్తికపౌర్ణమి స్నానాలపై నీలినీడలు అలుముకున్నాయి. కార్తికమాసాన్ని పురస్కరించుకొని సాగరతీరంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు నిత్యం తరలివస్తున్నారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈ ప్రాంతంలో కార్తికస్నానాలు చేసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. పౌర్ణమి ఒక్కరోజే సుమారు 50 వేల మందికి పైగా భక్తులు పాలకాయతిప్ప బీచ్ వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

సాగరతీరంలో కానరాని ఏర్పాట్లు..

పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు తీరానికి పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిసినా కూడా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పర్యాటకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కార్తికమాసం ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా కూడా అధికారులు తీరం కనీసం తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదంటే వారి పనితీరును అర్థం చేసుకోవచ్చు. మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయలేదని భక్తులు మండిపడుతున్నారు. పౌర్ణమికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారని తెలిసినా కూడా ఇదే తరహాలో వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎలాంటి ప్రకటన లేదు...

ప్రతి సంవత్సరం కార్తీకపౌర్ణమి స్నానాలకు తీరంలో చేయాల్సిన ఏర్పాట్లపై అన్ని శాఖలాధికారులతో ఆర్డీఓ స్థాయి అధికారి పది రోజుల ముందుగానే సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సుమారు 25 ఏళ్ల నుంచి ఇలా సమీక్షా సమావేశం నిర్వహించి, అక్కడ ఏర్పాట్లుపై చర్చిస్తారు. అయితే ఈ ఏడాది మాత్రం అలాంటి సమావేశాన్ని అధికారులు నిర్వహించలేదు. పౌర్ణమి స్నానాల గురించి ఏవిధమైన ప్రకటన చేయలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్లలో భారీ ఏర్పాట్లు

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల పాటు హంసలదీవి సాగరతీరంలో కార్తీకపౌర్ణమిని భారీ ఏర్పాట్లు చేశారు. కృష్ణమ్మ సాగరుడిలో కలిసే సాగరసంగమం ప్రాంతం వద్ద కూడా పర్యాటకుల సౌలభ్యం కోసం జల్లుస్నానాలను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భక్తుల మనోభావాలను కాలరాస్తుందని పర్యాటకులు మండిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం కనీస వసతులు కల్పించేందుకు కూడా చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కార్తీకపౌర్ణమి స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

పుణ్యస్నానాలతో పులకించిన కృష్ణాతీరం

- సోమవారం విశిష్టతతో శ్రీరామక్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- శ్రీరామలింగేశ్వరునికి భక్తుల స్వీయ అభిషేకాలు
- నది ఒడ్డున కార్తిక ఒత్తులు వెలిగించిన మహిళలు



నాగాయలంక కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు పోటెత్తిన భక్తులు



నాగాయలంక కృష్ణ ఒడ్డున శ్రీరామలింగేశ్వరునికి స్వీయ అభిషేకాలకు క్యూ కట్టిన భక్తులు

నాగాయలంక:శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్ వద్ద తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. మండలంలోని నాగాయలంక, పరిసరాల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామి మండపంలో శివలింగానికి భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీయ అభిషేకాలు చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. సముద్రపు బ్యాక్ వాటర్‌తో సంగమమైన కృష్ణానది చెంతనే శివలింగం ఉండటం భక్తులకు ప్రత్యేక ఆకర్షణ కావడం అభిషేకాల అవకాశం కలిగించడంతో అభిషేక పూజల కోలాహలం నెలకొంది. భక్తజనం, అయ్యప్ప దీక్షాపరులు కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేశారు. స్నానాల అనంతరం భక్తులు నదిఒడ్డున ప్రమిదల్లో కార్తిక ఒత్తులతో దీపాలు వెలిగించి సంప్రదాయక పూజ తదుపరి పూజాద్రవ్యాలు నదిలో సమర్పించారు. ముందు జాగ్రత్త చర్యగా స్థానిక ఎస్ఐ కె.రాజేష్ నది ఒడ్డున ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టించారు. కానిస్టేబుళ్ళు ఇద్దరు బందోబస్తు నిర్వర్తించారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

పెదకళ్లేపల్లి(మోపిదేవి):మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో విజయవాడ హెల్ప్ ఆస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి సోమవారం తెలిపారు. ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి వైద్య పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఆయాసం, గుండెదడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగడం, ఎడమ చేయి లాగడం, ఎక్కువకాలంగా బీపీ, షుగర్ ఉన్నవారికి గుండె స్కానింగ్ పరీక్షలు, ఈసీజీ, 2డి ఏకో స్కానింగ్ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తామని వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా యాంజియో గ్రామ్ పరీక్ష చేసి వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పెదకళ్లేపల్లి గ్రామ, పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్



ఘంటసాలలో తహసీల్దార్ విజయ ప్రసాద్‌కు అర్జీ ఇస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

ఘంటసాల:కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు అందిస్తానన్న పెట్టుబడి సాయాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు డిమాండ్ చేశారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు సోమవారం ఏపీ రైతు సంఘం తరపున వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని మరిచిపోయారని తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు నాయకులు వేమూరి రత్నగిరిరావు, మల్లుపెద్ది బోసు, చంద్ర సుబ్బారావు, దాసరి గోపాల కృష్ణ, నక్కా శ్రీను, నాగమల్లి, ఆర్ ఎంపీ శేషు, తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి(అవనిగడ్డ):వ్యవసాయానికి పెట్టుబడి సహాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన చల్లపల్లి డెప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, రైతు నాయకులు వేమూరి రత్నగిరిరావు, మల్లుపెద్ది బోసు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయురాలు ముంతాజ్ బేగంకు అవార్డు



మంత్రులు చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న ముంతాజ్‌బేగం

పెడన:పట్టణంలోని వీరభద్రపురం ఉర్దూ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉర్దూ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ముంతాజ్ బేగాన్ని 2024–25 ఏడాదికి గానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ అందించే ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు వరించింది. భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి పురస్కరించుకుని సోమవారం మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముంతాజ్ బేగంకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ వైద్య విద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ అవార్డును అందజేశారు. 2000 సంవత్సరంలో ఎయిడెడ్ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరినప్పటి నుంచి ఎంతోమంది మైనార్టీ బాల, బాలికల విద్యాభివృద్ధికి పాటు పడినందుకు అవార్డు అందజేశారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పెడన ఎంఈవో–1 దుర్గ ప్రసాద్, ఎంఈవో–2 హరనాథ్, పాఠశాల హెచ్‌ఎం ఈసా, మైనారిటీ ప్రముఖులు తదితరులు ఆమెను అభినందించారు.

కరకట్టపై అదుపుతప్పి కారు పల్టీ



పాపవినాశనం కరకట్ట నుంచి కృష్ణానదిలోకి పల్టీ కొట్టిన కారు

పాపవినాశనం(ఘంటసాల):కృష్ణానది కరకట్టపై కారు అదుపుతప్పి నదివైపు దూసుకుపోయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి ఘంటసాల మండలం పాపవినాశనం కరకట్ట మీద ఆశ్రమం సమీప మలుపులో చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన సయ్యద్ కలీం, సయ్యద్ అలీ దాదా, షేక్ మెహబూబ్ కారులో చల్లపల్లి వచ్చి తిరిగి వెళుతుండగా పాపవినాశనం కృష్ణా కరకట్ట ఆశ్రమం మలుపువద్ద కారు అదుపుతప్పి పల్టీ కొట్టి కృష్ణానది వైపు దూసుకెళ్లింది. దారిన వెళ్లే వాహనదారులు ప్రమాదాన్ని గమనించి 108కు సమాచారం అందించారు. చల్లపల్లి నుంచి 108 సిబ్బంది ఈఎంటీ బండ్రపల్లి అశ్విని, పైలెట్ అబ్దుల్ షఫీ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తిరగబడి నుజ్జు నుజ్జయిన కారులో సయ్యద్ అలీదాదాకు తీవ్ర గాయాలై రెండు చేతులు విరిగాయి, సయ్యద్ కలీం తలకు గాయం కాగా మెహబూబ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు కరకట్ట కింద నది తీరంలో దాదాపు 15 అడుగుల లోతులో ఉండటంతో బాధితులను పైకి చేర్చేందుకు పైలెట్ అబ్దుల్ షఫీ తీవ్రంగా శ్రమించి తీవ్ర గాయాల పాలైన అలీదాదాను ఏటవాలుగా ముళ్లపొదలతో ఉన్న కరకట్టపైకి చేర్చడం అసాధ్యం కావడంతో పైలెట్ షఫీ అతనిని స్కూప్ పై పడుకోబెట్టి తాళ్లతో కట్టి స్థానికుల సహకారంతో తీవ్రంగా శ్రమించి రోడ్డు పైకి చేర్చారు. అంబులెన్సు ఈఎంటీ అశ్వినీ కుమారి తక్షణ చికిత్స అందించిన అనంతరం బంధువులు ప్రైవేటు వాహనంలో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలపాలైన సయ్యద్ కలీంను అంబులెన్సులో చల్లపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అబుల్ కలాం ఆజాద్ అందరికీ ఆదర్శనీయుడు



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసిన అర్పిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్:స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందరికీ ఆదర్శనీయుడని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు కొనియాడారు.ఆజాద్ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి విద్యా శాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ పనిచేశారని చెప్పారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ, ఏ ఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ లు సతీష్ కుమార్, రవికుమార్, రవి కిరణ్, రాఘవయ్య, గూడూరు ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు:భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ జయంతి సోమవారం గూడూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆకులమన్నాడు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మొహమ్మద్ రఫీ మౌలానా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక ముస్లిం మైనార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో కార్తిక సందడి



నాగాయలంకలో రామలింగేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న కమిటీ చైర్మన్ ఆలూరి దంపతులు



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెడన శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

కోడూరు:కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడూరులోని పార్వతి సమేత సోమేశ్వరస్వామివారి ఆలయంలో లింగాకారుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశ్వనాథపల్లి కాశీవిశ్వేశ్వరస్వామికి అన్నాభిషేకం జరిపి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరస్వామి, మాచవరం రామేశ్వరస్వామి, సాలెంపాలెం ఆగస్త్యేశ్వరస్వామి, వేణుగోపాలపురం అమరలింగేశ్వరస్వామి, పిట్టల్లంక బాలనాగేశ్వరస్వామి, హంసలదీవి కాశీవిశ్వేశ్వర స్వామివారి ఆలయాల్లో లింగాకారులకు అభిషేకాలు నిర్వహించారు.

శివాలయాల్లో కార్తిక అభిషేకాలు

నాగాయలంక: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా రెండో సోమవారం మండలంలోని పలు శివాలయాల్లో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కార్తిక దీపాలంకరణ చేశారు. నాగాయలంక కృష్ణాతీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్‌లో కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, సుజనకుమారి దంపతులు నేతృత్వంలో శ్రీరామలింగేశ్వరస్వామికి వివిధ సుంగధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో అభిషేకాలు, పూజ, అలంకారం నిర్వహించారు. నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో స్వామికి భక్తుల సమక్షంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. సంగమేశ్వరస్వామి దేవాలయన్ని దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందర్శించి కార్తిక ఒత్తులు వెలిగించారు. ఆలయ అర్చకుడు కె. తిరుమల సాయి భార్గవ్ అభిషేకాలు, పూజలు జరిపి హారతులిచ్చారు. భావదేవరపల్లి అన్నపూర్ణదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో మహిళలు ప్రమిదల్లో ఒత్తులు వెలిగించారు. అర్చకుడు సుబ్బారావు బ్రహ్మత్వంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

శివనామంతో మార్మోగిన శివాలయాలు

పెడన:పట్టణంలో వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానంతో పాటు మండల వ్యాప్తంగా పలు శైవక్షేత్రాల్లో కార్తిక సోమవారం రెండో వారం హర హర శంభోశంకర, ఓం నమః శివాయ...అంటూ భక్తులు దేవదేవుడిని స్మరించడంతో దేవాలయ ప్రాంగణాలు మార్మోగాయి. వేకువ జాము నుంచే ఆలయాలకు చేరుకుని ధ్వజ స్తంబం గణనాథుని వద్ద దీపారాధన చేసిన తర్వాత కొందరు ఆలయం వెనుక ఆవరణలో దీపాలు వెలిగించారు.



కోడూరులో ప్రత్యేక అలంకారంలో లింగాకారుడు

మోపిదేవి:కార్తికమాసం సందర్భంగా మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పెదకళ్లేపల్లి దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానం, కె. కొత్తపాలెం శ్రీదుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయాల్లో సోమవారం దీపారాధనలు చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో శైవక్షేత్రాల్లో సందడి నెలకొంది.

కోనేరుసెంటర్:మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, భస్మాభిషేకం జరిపించారు. దీపారాధన చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శివాలయానికి పోటెత్తిన భక్తులు

కృత్తివెన్ను: కార్తిక మాసం రెండవ సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కత్తివెన్నులోని శ్రీ దుర్గా పార్వతి సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో వేకువ జాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు దంపతులు స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. మండలంలోని చిన్న పాండ్రాక మార్కండేశ్వర స్వామి ఆలయమునందు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాదేవుడికి మహాభిషేకం



సామూహిక దీప ప్రమిదల హారతి సమర్పించిన మహిళలు

నాగాయలంక:కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద మండపంలో శ్రీరామలింగేశ్వర స్వామికి 150 కిలోల పసుపుతో సోమవారం రాత్రి నిర్వహించిన మహాభిషేకం భక్తులను కనువిందు చేసింది. దాతలు వంగళ శ్రీనివాసరెడ్డి–సునీత, గోగినేని శ్రీధర్ విజయలక్ష్మి (శ్రీలక్ష్మీ వారాహి ఇండస్ట్రీస్) ఆర్థిక సౌజన్యంతో తలపెట్టిన మహాదేవుడికి పసుపు తొలి మహాభిషేకం దాతలే ప్రారంభించారు. అనంతరం వేడుకకు హాజరైన వందలాది మంది సామాన్య భక్తులు అందరితో శివయ్యకు పసుపు అభిషేకం చేయించారు. బ్రహ్మశ్రీ అంబా సాయి కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో అభిషేకం జరిగినంత సేపు భక్తుల సామూహిక శివనామ స్మరణతో కృష్ణాతీరం మార్మోగింది, స్వామిని అభిషేకించడానికి భక్తులు బారులు తీరారు. మండపం ఎదుట ఉంచిన కోటి ఒత్తుల దీప స్తంభానికి దాత వంకాయల శేషగిరి, ఆది రాజేష్ కుటుంబం జ్యోతి ప్రజ్వలన గావించారు. నవ హారతులకు అభిముఖంగా మహిళలు దీపప్రమిదలు ఉంచిన పళ్ళాలతో సామూహికంగా దేదీప్యమైన హారతి సమర్పించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, కార్య నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితరులు పర్యవేక్షించారు.



రామలింగేశ్వరునికి పసుపు అభిషేకిస్తున్న దాత దంపతులు



రామలింగేశ్వరునికి అభిషేకంతో కోటివత్తుల దాత కుటుంబం



అభిషేకం అయ్యవారికి శంఖనాదం చేస్తున్న భక్తుడు